మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## మైసమ్మ అడవికి
# ఆకతాయిల నిప్పు

**నవాబుపేట పోలీసుల అప్రమత్తతతో మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది**

**నవాబుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయ సమీపంలో అడవికి కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి మంటలు చేల రేగుతూనే ఉన్నాయి. విధుల్లో ఉన్న నవాబుపేట పోలీసుల అప్రమత్తతతో పై సిబ్బందికి కాల్ చేసి సమాచారం అందించగా ఆలయ సమీపంలోని మంటలను ఫైర్‌ఇంజన్ సిబ్బంది మంటలను అతి కష్టం మీద అదుపులోకి తెచ్చారు. ఆలయ సమీపంలో మద్యం దుకాణదారులు అడ్డగోలుగా అమ్ముతుండడంతో ఇలా ఆకతాయిలు రెచ్చిపోతున్నారని అన్నారు. మంటలు ఆలయ సమీపంలోని రోడ్డు మార్గంలో గల దాదాపు 20 చోట్ల నిప్పంటించారని ప్రజలు తెలిపారు. వేసవికాలం కాబట్టి ఎండుటాకులు ఎక్కువగా ఉండడంతో మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బందితో కలిసి అటవీశాఖ అధికారులు రేంజరు చెట్టుకొమ్మలతో మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. ఈ మంటలు దాదాపు కొంతమేర భక్తులు ఏర్పాటు చేసుకున్న గుడారాల వరకు వ్యాపించాయి. ఆకతాయిల తప్పిదాలకు అడవులతోపాటు అనేక ఔషధ మొక్కలు, క్రిమికీటకాలు కాలిపోతున్నాయని వన్యప్రాణి సంరక్షణాధికార విభాగం ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. తాగుబోతులు గాని ఆకతాయిలు కానీ అడవికి నిప్పు పెడితే జైలు శిక్ష తప్పదన్నారు. ఎవరైనా అడవుల్లోకి వెళితే తమకు సమాచారమివ్వాలని సిబ్బంది స్థానికులను కోరారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## డిప్యూటీ కలెక్టర్లుగా
# ఆర్టీసీ ఉద్యోగుల కూతుళ్లు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** నారాయణపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఇద్దరి ఆర్టీసీ ఉద్యోగులకు కూతుళ్లు గ్రూప్1 పరీక్షల్లో సత్తాచాటి డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికయ్యా రు. పేట డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ఎరుకలి శ్రీనివాస్ కూతురు కుమారి వీణ 484.5 మార్కులతో ప్రతిభ కనబరిచి 118 వ ర్యాంకు సాధించింది. అదే డిపోలో పనిచేస్తున్న ట్రాఫిక్ డిప్యూటీ సూపరిండెంట్‌గా పనిచేస్తున్న వహీద్ కూతురు పాహిమినా ఫైజ్ ప్రతిభ కనబరిచి 126 వ ర్యాంకు సాధించింది. ర్యాంకు సాధించడం పట్ల మంగళవారం డిపో మేనేజర్ లావణ్య, సిబ్బంది వారిద్దరిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.



డిప్యూటి కలెక్టర్లుగా ఎంపికైన విద్యార్థులు

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

**రేషన్ బియ్యం పంపిణీలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**రాజాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం పేదింటి కుటుంబాలకు వరం లాంటిదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజాపూర్ మండలంలోని రాయపల్లి గ్రామంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. నిరుపేద ప్రజలను అన్ని విధాల ఆదుకునే విధంగా వివిధ రకాల సంక్షేమ ఫలాలను పేదలకు అందించడం జరుగుతుందని అన్నారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేసే సన్న బియ్యం ప్రతి పేద కుటుంబానికి కడుపునిండా అన్నం తినే విధంగా ప్రభుత్వం సహాయప డుతుందని అన్నారు. ప్రజలు సన్నబియ్యాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాయపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## సన్న బియ్యంతో పేదలకు
# ప్రతి రోజూ పండగే : ఎమ్మెల్యే

**మక్తల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీతో ఇకపై నిరుపేదలకు సైతం ప్రతిరోజు పండగేనని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్ ఏరియాలో గల ఆరో నెంబర్ రేషన్ దుకాణంలో పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి మంగళవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నేరుగా ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్న బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మన రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండడం గర్వకారణం అన్నారు. గతంలో లబ్ధిదారులకు దొడ్డు బియ్యం అందజేస్తే ఎవరు కూడా ఆ బియ్యాన్ని అన్నం వండుకొని తినే పరిస్థితి లేదన్నారు. దీంతో దళారులు గ్రామాల్లో తిరుగుతూ దొడ్డు బియ్యం పేదల నుంచి కొన్ని మిల్లర్లకు అమ్ముతూ సొమ్ము చేసుకునే వారన్నారు. ఎప్పుడైనా పండుగ రోజుల్లో మాత్రమే నిరుపేదలు దుకాణాల్లో సన్న బియ్యం అధిక రేటుకు కొనుక్కొని వండుకొని తినే వారన్నారు. అందుకే ప్రతి నిరుపేద కుటుంబం కూడా ప్రతిరోజు సన్నబియ్యంతో అన్నం వండుకొని తినాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. లబ్ధిదారులు ఎవరు కూడా సన్నబియ్యాన్ని అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అధికారులు ఈ విషయమై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ జి. బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, డీటీలు గురు రాజారావు, పుష్పలత, ఆర్ఐ భూపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కావలి తాయప్ప, అమరేందర్ రెడ్డి, రహీం పటేల్, గొల్లపల్లి నారాయణ, గడ్డం రమేష్, వాకిటి శ్యామ్, చెన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## పేదల కోసమే సన్న బియ్యం పంపిణీ : ఎమ్మెల్యే

**ధన్వాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ధన్వాడలో మంగళవారం సన్న బియ్యం పథకం ప్రారంభించారు. కోటపక్కాలోని బాబ డీలర్ షాపు వద్ద ఎమ్మెల్యే రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం అందజేశారు. పేద ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన పదవి కాలంలో అన్ని అభివృద్ధి పనులు చేసి ముందుకు తీసుకుపోతున్నానన్నారు. ధన్వాడ విషయంలో అధికారులు ఏ పని ఆగకుండా పనులన్ని పూర్తి చేయాలని చెప్పడం జరిగిందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింహజ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు జెట్రం లక్ష్మయ్యగౌడ్, నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, మండల అధ్యక్షుడు నరహరి ముదిరాజ్, ఉసు బాలకృష్ణ, చీరాల సుధాకర్ రెడ్డి, రహీమన్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెసిబి రాజు, జుట్ల ఆనంద్ గౌడ్, షాకిర్ హుస్సేన్ పాటుగా పలువురు పాల్గొన్నారు.


సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## రాజకీయ పంతంతో నలిగిన
# పేద బతుకులు


నిరుపయోగంగా ఉన్న 100 పడకల ఆసుపత్రి

**నిరుపయోగంగా 100 పడకల ఆసుపత్రి**

**ప్రజా వైద్యంపై సర్కారు చిన్నచూపు**

**అలంపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు ఒకెత్తు అయితే, అలంపూర్ రాజకీయాలు మరో ఎత్తు. ఇక్కడ ఉన్న పాలకులకు ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టవు. కేవలం ఎన్నికలలో గెలిచేందుకు మాత్రమే హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడంలో విఫలం అవుతున్నారని ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది అందుకు చక్కటి ఉదాహరణ కోట్లు వెచ్చించి నిర్మించిన వంద పడకల ఆసుపత్రి వైద్య సేవలకు నేటికీ అందుబాటులోకి రాకపోవడమే. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని చెప్పి అప్పటి ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.23 కోట్ల రూపాయలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా అలంపూర్ చౌరస్తాలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించింది. అయితే ఎన్నికల సమయంలో అరకొర వైద్య పరికరాలు, ఏలాంటి వైద్య సిబ్బంది లేకుండానే అప్పటి మంత్రి చేత ప్రారంభించారు.

**సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు..**

అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు మెరుగైన వైద్య చికిత్స కోసం పక్కన ఉన్న కర్నూలు లేదా సుదూర ప్రాంతమైన హైదరాబాద్‌కి తరలి వెళ్లేవారు. కొన్ని సందర్భాల్లో అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేక విలువైన ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని అలంపూర్ చౌరస్తాలో 100పడకల ఆసుపత్రి నిర్మించారు. అయితే హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు మాత్రం అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు వారి రాజకీయ ఉనికి కోసం రాజకీయాలు చేస్తూ పేదవాడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే చర్చ ప్రజల్లో జరుగుతుంది. రాజకీయాలు పక్కన పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**మంత్రి మాటలు నీటి మీద రాతలేనా?**

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ వైద్య ఆరోగ్య శాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ జోగులాంబ అమ్మవారి దర్శనం నిమిత్తం అల్లంపూర్‌కి వచ్చారు. ఆ సమయంలో అటుగా వెళుతూ మంత్రి అల్లంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆసుపత్రిని పరిశీలించి త్వరలోనే హాస్పిటల్ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నేటికీ మాటలు తప్ప ఆస్పత్రిలో వైద్య సేవలు లేవని ప్రజలు వాపోతున్నారు.

### ప్రజల ప్రాణాలు కాపాడాలి



**రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలకులు పనిచేయాలని కోట్లు పెట్టి కట్టించిన హాస్పిటల్ నిరుపయోగంగా ఉండడం బాధాకరమని యాక్సిడెంట్లు జరిగి సకాలంలో వైద్య మందక చాలామంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్‌ను త్వరగా అందుబాటులోకి తెచ్చి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.**

*కాశపోగు రాజు, వడ్డేపల్లి మాజీ జెడ్పిటిసి*

# నిర్విరామంగా స్టీల్ తొలగింపు

- వేగంగా కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు
- నేడు సహాయక చర్యలను పరిశీలించనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్1, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న స్టీలు, ఇనుము పదార్థాలను నిర్విరామంగా టన్నెల్ బయటకు తరలిస్తున్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఆఫీస్ వద్ద సొరంగం ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్న సహాయక బృందాల ఉన్నత అధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. సొరంగంలోపల జరుగుతున్న సహాయక చర్యలపై, సహాయక బృందాలు చేపడుతున్న పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీఎం చివరి భాగాలను కత్తిరించి మట్టి తవ్వకాలు చేపట్టినట్లు, సహాయక పనులకు అడ్డంకి గా ఉన్న టీబీఎం భాగాలను బయటకు తరలిస్తున్నట్లు, ఊట నీటిని బయటకు తరలించే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు వివరించారు. కేంద్ర రాష్ట్ర సహాయక బృందాలు సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు,కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఉదయం 11గంటలకు దోమల పెంటలోని ఎస్ఎల్బీసీ టన్నెల్‌ను సందర్శించనున్నారు.ఈ సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లాఅదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ దేవసహాయం,ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్,విజయ్‌కుమార్,సింగరేణి అధికారి మాధవరావు, ఎన్డిఆర్ఎఫ్ అధికారులు మన్మోహన్ యాదవ్,సత్యనారాయణ, ఎస్డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి జయ ప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేత చంద్ర, రవీంద్రనాథ్, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి,కేరళ కడవర్ డాగ్స్ ప్రతినిధి, ప్రభాత్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది

# భూముల వేలాన్ని వెంటనే ఆపండి

- ఆరు గ్యారంటీల కోసం అమ్ముతున్నారా..
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేస్తున్న ఎంపీలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే ఆపాలంటూ ఎంపీ డీకే. అరుణ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ వివాదంపై ఢిల్లీలో ఆమె స్పందించారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. "రేవంత్ రెడ్డి ఎవరికోసం ఈ భూములను వేలం వేస్తున్నావ్..? నీ మొండి వైఖరి విడిచిపెట్టు, హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే ఆపేయ్" అంటూ ఎంపీ డీకే.అరుణ అల్టిమేటం – మిగతా4లో..

# బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం

- పవిత్ర స్థలంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం
- జోగులాంబ గద్వాల్ మల్టీ జోన్ ఐజి సత్యనారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జోగులాంబ గద్వాల్ మల్టీ జోన్ ఐజి సత్యనారాయణ

**ఊర్కొండ, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:** ఊర్కొండపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో ఓ మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత పాశావికమని జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ పేర్కొన్నారు. మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన స్థలాన్ని మంగళవారం జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మల్టీజోన్ ఐజి సత్యనారాయణ మాట్లాడుతూ పవిత్ర పుణ్య క్షేత్రాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. అత్యాచార ఘటనకు సంబంధించి సీసీ కెమెరాల ఆధారంగా ఇప్పటికే 7 మంది యువకులను గుర్తించి అరెస్టు చేసి విచారిస్తున్నామన్నారు. సామూహిక అత్యాచార ఘటనలో 7మందితో పాటు ఇంకా ఎవరికైనా ప్రమేయం ఉందా అనే దానిపై లోతుగా విచారణ చేపడుతున్నామన్నారు. మహిళపై సామూహికంగా అత్యాచారానికి పాల్పడ్డ బాధ్యులను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. పవిత్ర స్థలాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ భద్రతతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ తర్వాత సామూహిక అత్యాచార ఘటన నిందితుల వివరాలు వెల్లడిస్తామని సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో దేవాలయం పాలక మండలి చైర్మన్ నారెడ్డి సత్యనారాయణరెడ్డి, ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి, కల్వకుర్తి డిఎస్పి వెంకటేశ్వర్లు, సిఐ నాగార్జున, స్థానిక ఎస్సై కృష్ణదేవ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఆరు గ్యారంటీల అమలు దిశగా సీఎం రేవంత్ రెడ్డి అడుగులు
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం
- తాటికొండలో తాగునీటి సమస్యను మూడ్రోజుల్లో తీరుస్తానన్న ఎమ్మెల్యే
- భూత్పూర్,తాటికొండలలో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) స్పష్టం చేశారు.రాష్ట్రాన్ని గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ నేతలు దొరికిందంతా దోచుకుని తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు.రాష్ట్రంలో ఏడు లక్షల కోట్ల అప్పులు తమ నెత్తిన పెట్టి పోయారని అన్నారు.మంగళవారం భూత్పూర్,తాటికొండలలో రేషన్‌షాపుల ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.సన్నబియ్యం పంపిణీ ద్వారా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా,రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతున్నా పేదలకు సన్నబియ్యం అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి రాష్ట్రంలోని 3.10కోట్ల మందికి రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తోందని చెప్పారు.తమ ప్రభుత్వం అధికారం చేపట్టాక పారదర్శకంగా ప్రజాపాలన నిర్వహించి ప్రజల కొత్తగా తీసుకున్న మరో పది లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని,ఆర్టీసీకి రు.5వేల కోట్ల నిధులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల వరకు కార్పొరేట్ వైద్యమందిస్తున్నామని చెప్పారు.తాటికొండ గ్రామానికి రు.72లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను మూడ్రోజుల్లో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జీఎంఆర్ హామి ఇచ్చారు.అధికారం చేపట్టిన 15నెలల్లోనే పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇదివరకు ఎమ్మెల్యేల్లా కాకుండా మన ఎమ్మెల్యే జీఎంఆర్ అలుపెంగని పోరాటయోధుడని అన్నారు.పిలిస్తే పలికే నాయకుడని పేర్కొన్నారు. మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు పేర్కొన్న విధంగా ఆరు గ్యారం టీలు అమలు చేస్తోందన్నారు.ఎమ్మెల్యే జీఎంఆర్ నేతృత్వంలో దేవరకద్ర నియోజక వర్గం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో భూత్పూర్ తహశిల్దార్ జయలక్ష్మి,ఆర్ఐలు వెంకటేష్,బాలసుబ్రమణ్యంలతో పాటు భూత్పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి మొల్గర నర్సింహులు,ఓబీసీ సెల్ అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు,భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆగిరి రవి,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు మొల్గర నర్సింహ్మారెడ్డి, గోవర్ధన్‌గౌడ్,లాలూ నాయక్,కొరె పవన్,శివరా ములు,సంజీవరెడ్డి,కొండన్న, బాలవర్ధన్‌రెడ్డి,మాజీ నర్సింహులు,రాంరెడ్డి,వెంకటేష్, రవీంద్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి,కిట్టురెడ్డి,టీవీ రెడ్డి,దెంది లక్ష్మికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాటికొండలోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


సమావేశానికి హాజరైన ప్రజలు,మహిళలు

## ఒకే రోజు 6 నార్మల్ కాన్పులు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు**

**పెబ్బేరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం 8 గంటల వరకు ఆరు గర్భిణి స్త్రీలు నార్మల్ డెలివరీలు చేసిన సందర్భంగా మంగళవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు సందర్శించి ప్రసవాలు జరిగిన బాలింతలను, చంటి బిడ్డలను పరీక్షించారు, వారందరూ ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు. డాక్టర్ ప్రవళికను, స్టాఫ్ నర్సింగ్ చరితను, కాంటిజెన్సీ వర్కర్ గౌరి, సిబ్బందిని అభినందించారు. అనంతరం హాస్పిటల్ ఆవరణంలో అదనపు గది నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టరును త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే త్వరలోనే 30 పడకల ఆసుపత్రి పనులు కూడా ప్రారంభం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలలో హెల్త్ సూపర్వైజర్స్ లీలమ్మ, స్వరూప రాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, స్టాఫ్ నర్సింగ్ ఊర్మిళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపిలలను పరీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు

## సెంట్రల్ యూనివర్సిటీ భూములపై వెనక్కి తగ్గాలి

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి శివారులో సర్వే.నం 25 లోని 400 ఎకరాల భూమిపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తుందని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పీకే.నరసింహ ఆరోపించారు. అర్ధరాత్రి బుల్డోజర్లతో చెట్లను నరుకుతుంటే నెమలుల ఆర్తనాదాలు హృదయవిదారకంగా ఉన్నాయని యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం అణిచివేతకు పాల్పడుతుందని దీనిని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులను అక్రమ అరెస్టులకు పాల్పడిందని, హైదరాబాద్‌కు ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలేనని ప్రభుత్వం గుర్తించాలని, వన్యప్రాణి సంరక్షణ అనే పదాన్ని తుంగలో తొక్కి అడ్డగోలు హామీలను ఇచ్చి వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల ముచ్చటను అటకెక్కించి విద్యార్థులపై అవలంబిస్తున్న తీరు దుర్మార్గమని దీనిని బీజేవైఎం మక్తల్ శాఖ తీవ్రంగా కండిస్తుందన్నారు. ఇలా గ్రీన్ ప్రాంతాలను అమ్ముకుంటూ పోతే ఢిల్లీ తరహా భవిష్యత్తులో పశ్చిమ హైదరాబాద్‌లో ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతుందని తక్షణమే ప్రభుత్వం నిర్ణయన్ని మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుర్వలింగం, రాజగౌడ్ బ్యాటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెవైఎం నాయకులు

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**మక్తల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని యాదవ నగర్‌లో వెలసిన శ్రీ వీరభద్రేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ప్రభోత్సవ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో అగ్ని గుండం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ జి.బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి నాయకులు గణేష్ కుమార్, రవికుమార్, కట్ట సురేష్, కావలి తాయప్ప, కల్లూరి నాగప్ప, గుంతలి శివకుమార్, గడ్డం రమేష్, వాకిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

## జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపిక

**టెక్నికల్ అఫీషియల్‌గా బి.రూప, క్రీడాకారిణిగా వై. శశిరేఖ**

**మక్తల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** నేటి నుంచి ఈనెల 5 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి బి.రూప, క్రీడాకారిణి వై. శశిరేఖ ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచిన వై.శశిరేఖ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్ తెలిపారు. అలాగే ఈ పోటీలకు టెక్నికల్ అఫీషియల్ (అంపైర్)గా పాఠశాల పిడి బి. రూప ఎంపిక కావడం జరిగిందన్నారు. జాతీయ స్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన పిడి బి. రూప, క్రీడాకారిణి వై.శశిరేఖ ఇద్దరు ఒకే సమయంలో ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. జాతీయ స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి తమ పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం పూరీకి వెళ్తున్న బి.రూప, వై. శశిరేఖలను జిహెచ్ఎంతో పాటు షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.





## గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

**గద్వాల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఐపీఎస్ మంగళవారం గద్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డ్ లను, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునితో సిబ్బంది గౌరవంగా మెలగాలని, వచ్చినా ఫిర్యాదు పై తక్షణమే విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సైకి సూచించారు. నిత్యం ప్రజలతో లైసనింగ్ మెయింటేన్ చేస్తూ నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించాలని అన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ, బీట్ సిబ్బందిని పెంచి పట్టణంలో ఎలాంటి నేరాలు జరగకుండా నిఘా పెంచాలని, పగలు వేళల్లో తిరిగే బ్లూ కోల్ట్స్ సిబ్బంది అలర్ట్‌గా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆయా కేసులలో పట్టుబడ్డ వాహనాలు కోర్టు అనుమతి తీసుకొని డిస్పోజల్ చెయ్యాలని ఎస్సై కళ్యాణ్ కుమార్ ను ఆదేశించారు. ఎస్పి వెంట డి.ఎస్పి వై.మోగిలయ్య, సిఐ టి. శ్రీను ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

## సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తాం

**గద్వాల టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గతంలో లో ఎప్పుడో జరిగినా వివాదాలు పరిష్కరించబడి ప్రశాంతంగా ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన వీడియోస్ ను మరల సోషియల్ మీడియాలో పోస్టు చేసి తప్పుడూ కథనాలను సోషల్ మీడియాలో పోస్టు చేసే వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు చేస్తామని గద్వాల్ సిఐ టంగుటూరి శ్రీనివాస్ హెచ్చరించారు. గతంలో లో అనగా సుమారు 3 సంవత్సరాల క్రితం రేగి దొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామం లో డా.బి.అర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో గ్రామం లో వివాదాలు జరుగగా ఆ సమయంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ, పోలీస్ అధికారులు మాట్లాడి డా.బి.అర్.అంబేద్కర్ విగ్రహం ను ఘనంగా ఏర్పాటు చెయ్యడం జరిగిందనీ ఆయన అన్నారు. సుమారు 3 సంవత్సరాలుగా గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నారనీ ,అందుకు సంబంధించిన ప్రస్తుత ఫోటో కూడా చూడవచ్చు, కానీ పాత వీడియోస్ ను కొందరు వ్యక్తులు సోషల్ మీడియా లో మరలా పోస్టు చేస్తూ ఫేక్ న్యూస్ వ్రాస్తూ షేర్ చెయ్యడం జరుగుతుందన్నారు. అట్టి వారి పై జిల్లా సోషల్ మీడియా సెల్ నిఘా ఉంచిందనీ, వారిని గుర్తించి చట్ట ప్రకారం తీసుకుని కేసులు నమోదు చెయ్యడం జరుగుతుందను ఆయన హెచ్చరించారు. కావునా సోషల్ మీడియా లోఎవ్వరు కూడా ఫేక్ న్యూస్ ను సర్క్యులేట్ చేయవద్దనీ, ఉల్లగించిన వారి పై కేసులు నమోదు చెయ్యడం జరుగుతుందనీ అన్నారు.

# సంపన్నులతో సమానంగా పేదోడికి సన్నబియ్యం

**మండలంలో ఇంకా 8 రేషన్ షాపులకు సరఫరా కాని సన్న బియ్యం.. తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభం**

**ఇటిక్యాల ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాలనలో మంగళవారం రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా తెల్ల కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కేజీల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఉమ్మడి మండలంలో మంగళవారం నాడు రేషన్ డీలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. అందులో భాగంగా ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఇటిక్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు భాస్కర్, సంపత్, శేఖర్, రాజు, యాకోబ్, శాంతన్న, విజయ్, డీలర్ యుగంధర్ రెడ్డి కలిసి తెల్లకార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం వారు ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ రాముడు, తిమ్మారెడ్డి, వెంకటన్న, గ్రామ డీలర్ రాథోడ్ కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సంపన్నుడు తినే సన్న బియ్యాన్ని ఇకనుండి ప్రతి పేదవాడు తెల్ల కార్డుదారులు కూడా సన్న బియ్యం తినే అవకాశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని దేశంలో తొలిసారిగా అమలు చేశారని 75 ఏళ్ల భారత స్వాతంత్ర దేశంలో ఆహార భద్రత చట్టం కూడా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని వారు గుర్తు చేశారు. గ్రామాలలో తెల్ల కార్డులు కలిగిన వారు ఒక్కొక్కరికి ఇప్పటినుండి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.



ఇటిక్యాల రేషన్ షాప్‌లో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



వీరాపురం గ్రామంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

**మండలంలో 8 రేషన్ షాపులకు చేరని బియ్యం..**

ఉమ్మడి ఇటికాల మండలంలో 29 రేషన్ షాపులకు సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా ఇంకా 8 గ్రామాలకు బియ్యం స్టాకు చేరుకోలేదు. ఎర్రవల్లి మండలంలో కొండేరు, ధర్మవరం, జింకల పల్లి, వల్లూరు, ఇటిక్యాల మండలంలో షాబాద్, బుడ్డారెడ్డిపల్లి, చాగాపురం, గోపల్ దిన్నే 8 గ్రామాలకు సన్న బియ్యం సరఫరా కాలేకపోవడంతో ఈ గ్రామాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం నోచుకోలేదు. 2 రోజుల్లోగా మిగిలిపోయిన గ్రామాలకు సన్నబియ్యం స్టాకును పంపిస్తామని మానవపాడు గోదాం స్టాక్ పాయింట్ అధికారి సురేష్ తెలిపారు.

## గద్వాల కొత్త బావిని కాపాడాలని డిమాండ్ : సీపీఐ జిల్లా కార్యదర్శి

**గద్వాల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గద్వాలలో కొత్త బావిని అక్రమార్కుల చెర నుండి కాపాడేందుకు ప్రజలు ఏకం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజినేయులు పిలుపునిచ్చారు. గద్వాల కోట చారిత్రక కట్టడాలను రక్షించి, భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. గద్వాల ఘనకీర్తిని నేడు కబ్జాలతో కొందరు అప్రతిష్టపాలు చేస్తున్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన గద్వాల మున్సిపాల్ కమిషనర్ ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపాల్ చైర్మన్ యెక్క కట్టడాలు, ఆస్తుల పై సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి ఆంజినేయులు డిమాండ్ చేశారు. గద్వాల చారిత్రక కట్టడాలను, కోట బావులను, స్థలాలను కబ్జాలు కాకుండా రక్షించాలని, కొత్తబావిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గద్వాల జిల్లా సమితి డిమాండ్ చేసింది. గద్వాల చారిత్రిక కట్టడాలు, స్థలాలు, బావులు కబ్జాలకు గురవుతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపాలిటీ కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంజనేయులు మాట్లాడారు. కబ్జాలకు పాల్పడుతూ, ప్రభుత్వ స్థలాలను, బావులను కొల్లగొడుతున్న మాజీ మున్సిపాల్ చైర్మన్ వేణుగోపాల్ పై సమగ్ర విచారణ, దర్యాప్తు చేసి నిజమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని జిల్లా కలెక్టర్ ని కోరారు. ఎవరైనా ఫేక్ డాక్యుమెంట్స్‌తో, కొత్త బావి ఇతర స్థలాల విషయంలో తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించాలిసిన అవసరం లేదని అన్నారు. రాజులు నిర్మించిన కోట, చారిత్రిక కట్టడాలతో మంచి పేరు గద్వాలకు వచ్చిందని, వాటి రక్షణకు పునర్నిర్మాణం కొరకు పురావస్తు శాఖ, ప్రభుత్వం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్ లో ఎలాంటి సంఘటనలు జరిగితే అధికారులకు, నాయకులకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి డి రాము, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, సిపిఐ మండల నాయకులు ఖాసీం, ఎఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి పరమేష్, నాయకులు వెంకటన్న, గంగాధర్, కృష్ణ, కిరణ్ కుమార్ తదితులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి

**ఆత్మకూరు, ఏప్రిల్ 1 ప్రభాతవర్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని మంగళవారం ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా ,మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసిరాజు యాదవ్, నల్లగొండ శ్రీనివాసులు తదితరులు నేతృత్వంలో కలిసి విజ్ఞప్తి చేశారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలో నిర్మిస్తున్నటువంటి పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను తరలించుకునేందుకు దేవరకద్ర నియోజకవర్గంలోని ఒక చెట్టు వాగు పరిధి నుండి తమకు సహాయ సహకారాలు అందించి గుడి నిర్మాణం పూర్తయ్యేందుకు తమ వంతు సహకరించాల్సిందిగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లుగా వారు ప్రభాతవార్తకు తెలిపారు. ఇందుకుగాను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఇసుక తరలింపుకు అనుమతులు ఇవ్వడమే కాకుండా పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపినట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్, బిజెపి నాయకులు బాలకృష్ణ ,టీఆర్ఎస్ నాయకులు రవీందర్ తదితరులతో పాటుగా పెద్దమ్మ తల్లి గుడి ఆలయ నిర్మాణ కమిటీ పాల్గొన్నట్లుగా వారు తెలిపారు.



దేవరకద్ర ఎమ్మెల్యేను కలిసి సహకరించాలంటూ విజ్ఞప్తి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : మొగిలి అంజి

**ఉప్పునుంతల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయిస్తే ఉద్యమం ఆగదని, హెచ్‌సియు భూములు అమ్మి పాలన సాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన కొనసాగుతుందని బిజెవైఎం మండల అధ్యక్షుడు మొగిలి అంజి అన్నారు. మంగళవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న భారతీయ జనతా పార్టీ నాయకులను అక్రమ అరెస్టు చేసి ఉద్యమాన్ని అణిచి వేయాలని చూడడం అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. అధికార బలంతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే భవిష్యత్తులో శరమగీతం పాడే రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలను నిలిపివేయాలని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలని లేకపోతే ఉద్యమం ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమాలకు భారతీయ జనతా యువ మోర్చా ఉద్యమించడం ఖాయమని ఆయన తెలియజేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షులు మొగిలి అంజి, మేడమోని రాజు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సోట వెంకటేష్, మదనాగుల సైదులు, శివలు ఉన్నారు. హైదరాబాద్ లో ఉద్యమానికి వెళ్తున్న బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

## శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో డా.బి.ఆర్అంబేద్కర్ యువజన సంఘం 40వ వార్షికోత్సవ సందర్భంగా మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కేశపాగ రాజేష్ ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకులు కీ॥ దేవుని చంద్రయ్య డిపిఓ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి శ్రీరంగాపూం, పెబ్బేరు మండలాలలో, జిల్లాలలో అంబేద్కర్ యువజన సంఘాలను స్థాపించిన మహోన్నత వ్యక్తి విద్యా ద్వారానే మనిషి జీవితంలో మార్పు రాగలరని గ్రహించి ఎంతోమందికి విద్య పైన, అభివృద్ధి పైన అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపరిచిన జ్ఞాన యోధులు కీ॥ దేవుని చంద్రయ్య డిపిఓ జన్మదినం పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు సంస్థ ఆధ్వర్యంలో 40మంది దోనర్సోతో బ్లడ్ సేకరణకు విచ్చేసినందుకు హాస్పిటల్స్ సిబ్బంది ఎంతో ఆనందం తెలియచేయడం జరిగింది. కార్యక్రమంలో సంఘం మాజీఅధ్యక్షులు గూడెంబీచ్పల్లి, బుచ్చన్న, కురుమూర్తి, కాలనీ ఉద్యోగస్తులు, సంఘంకమిటీసభ్యులు, కాలనీవా సులు, యువకులు, వివిధ రాజకీయపార్టీలకు చెందిన రాజకీయ నాయకులు అతిథులుగా హాజరవ్వడం జరిగింది. మాజీ ఎంపీటీసీ ఎల్లస్వామి, మాజీజెడ్పిటిసి ఎం.రాజేంద్రప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీపీ పృథ్వీరాజ్, కంబాలాపూర్ మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, నరేష్ నాయుడు, గంగాధర్ యాదవ్, సతీష్ యాదవ్, వివిధ గ్రామాలకు చెందిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు హాజరు కావడం జరిగింది.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

## సన్న బియ్యం పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేసిన మహిళలు

**ముసాపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండలంలోని వేముల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేజియంఆర్ మాట్లాడుతూగత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టుకుంటూ ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. శ్రీమంతులేకాదు పేదలు కూడాసన్న బియ్యం తినాలన్నది ప్రజా ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. ఆహార భద్రత చట్టం తీసుకువచ్చి, రేషన్ షాపులు ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ పార్టీది దేశంలోనే పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిది. పండుగనాడే కాదు పేదలు ప్రతిరోజూ సన్న బియ్యం తినాలన్నా సంకల్పంతో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్, 2 లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ పథకాలను ఇప్పటికే ప్రారంభించాం. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో రైతులకు ఏక కాలంలో 21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశాం. బిఆర్ఎస్ పదేళ్ల చేయలేనిది ఒక్క సంవత్సరంలో చేసి చూపించాం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే 58000 వేల ఉద్యోగాలు ఇచ్చాము. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ది జరుగుతుంది, ఎవరికైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం అప్లికేషన్ లు పెట్టుకోవచ్చు, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. మాజీ ఎమ్మెల్యే అక్రమంగా కోట్ల రూపాయలు ఆర్జించాడే కానీ వేముల గ్రామానికి మాజీ ఎమ్మెల్యే చేసిందేమీ లేదు. వేముల గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. రాష్ట్రాన్ని దోచుకుని, అప్పులు చేసి బిఆర్ఎస్ ప్రభుత్వం చిప్ప చేతికిచ్చింది అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నాం, ఆశీర్వదించండి మన ముఖ్యమంత్రి పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి అండగా ఉండండి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ , జిల్లా మూడ చైర్మన్ లక్ష్మణ యాదవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరాజ్, మాజీ ఎంపీపీలు బగ్గి కృష్ణయ్య, బాల నరసింహులు, యూత్ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ అధ్యక్షులు సుధాకర్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, జైసి మండల అధ్యక్షులు తిరుపతయ్య గౌడ్, మాల వెంకటయ్య, గుజుల నాగన్న, సుండు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

## 5న అలంపూర్ చౌరస్తాలో జాబ్ మేళా

**అలంపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గద్వాల్‌జిల్లా ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో ఈనెల 5న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బిఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బోయినపల్లి భరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాను ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ ఫాక్స్‌కాన్ కంపెనీనందు ఉద్యోగఅవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 4వ తేది వరకు పేర్లు నమోదు ప్రక్రియ ఉంటుందని ఆ తర్వాత 5న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉద్యోగాలకు విద్యార్హత టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పేరు నమోదు ప్రక్రియ తదితర వివరాల కొరకు 9396660999,9866999789 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## చక చకా పల్లెల్లో సిసిరోడ్డు పనులు

**నవాబుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడ్డాక మారుమూల గ్రామాలు పల్లెల్లో అందమైన సీసీ రోడ్లు ఆహ్వానం పలుకుతున్నాయి. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నూజివీడు నోచుకోలేని గ్రామాలు కూడా నవాబుపేట మండలం పరిధిలోని గ్రామాలలో గ్రామాల రూపురేఖలు మారగా, సీసీ రోడ్లు వాటికి అదనపు హంగులను అద్దాయి అని కాంగ్రెస్ మండల నాయకులు ఇప్పటివరకు గ్రామంలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను మండల నాయకులు పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. గ్రామాల్లో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చేసింది. ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.75లక్షలు వసూలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ఎల్ఆర్ఎస్ ద్వారా ఆత్మకూర్ పట్టణం నుండి 75 లక్షల నిధులు వసూలు చేసినట్లుగా ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ విలేకరులకు తెలిపారు. గత నెల రోజులుగా పురపాలక సిబ్బంది పట్టణ ప్రజలను చైతన్య పరుస్తూ ఎల్ఆర్ఎస్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ దాదాపు 573 మంది లబ్ధిదారుల నుండి ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు చేసి 75 లక్షల నిధులను ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లుగా ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి పిల్లనిర్మానంలో కానీ, ప్లాట్ల క్రయవిక్రయాల్లో గాని సులభతరం అవుతుందని ఆయన తెలిపారు.

## జాతర కరపత్రాల విడుదల



జాతర కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటి సభ్యులు

**ధన్వాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ధన్వాడ శ్రీశ్రీశ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ, భజన కమిటీల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజాలు నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 5 నుంచి 8 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కరపత్రాల విడుదలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జాజిమీ వీరబద్రప్ప, సత్యనారాయణగౌడ్ బాలకిష్టయ్య టీచర్ టైలర్ శ్రీనివాస్ గౌడ్, చిరాల కొండారెడ్డి, బాలకృష్ణ, నరేందర్ గౌడ్, శివారెడ్డి వడ్ల శాంతికుమార్, అలుగుమీది భాస్కర్, కందుర్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ధర్మకర్త సుంకు నర్సిములు, భజన కమిటీ సభ్యులు అశ్విని నర్సిములు, నారాయణ, రంగయ్య, శ్రీనివాసులు, రిటైర్ ఎల్ఎస్ఎల్ హెచ్ఎం, సత్యనారాయణ, జయప్రకాష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్యనారయణలు పాల్గొన్నారు.

## 26 మందికి ఉచిత కంటి పరీక్షలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ ద్వారా మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినటువంటి ఉచిత కంటి వైద్య శిబిరంలో 26 మందికి పరీక్షలు నిర్వహించినట్లుగా ఆసుపత్రి వైద్య సిబ్బంది ప్రభాతవార్తకు తెలిపారు. మంగళవారం నిర్వహించినటువంటి ఉచిత కంటి పరీక్షల్లో 26 మందిలో ఆపరేషన్ అవసరమైన వారిని మహబూబ్‌నగర్ పట్టణంలోని కందూర్ రామ్ రెడ్డి ఆసుపత్రిక తరలించి అవసరమైన ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లుగా వైద్యులు దేవేంద్రనాథ్ తెలిపారు. భవిష్యత్తులో ఆత్మకూరు పట్టణంలో నిర్వహించబోయే ఉచిత కంటి వైద్య పరీక్షలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**మక్తల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని చిట్యాలలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలో భూమి పూజను నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రామలింగప్ప, మారుతి గౌడ్, నాయకులు లక్ష్మయ్య, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**■నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**



నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఏప్రిల్ 30 తేది వరకు అమల్లో ఉన్నం దున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్య క్రమాలు, బహిరంగసభలు, ప్రజలుగుమిగూడి ఉండే విధంగా కార్యక్ర మాలునిర్వహించడానికి సన్నాహాలుచేయరాదని తెలిపారు. అనుమత లు లేకుండాపైకార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలి పారు.ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకుదారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను వ్యాప్తిచేసినవారిపై కేసులనునమోదు చేయబడతాయని తెలిపారు. చట్టప రంగా జారీచేసిన ఆదేశాలనుఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30పోలీస్‌ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవు తారని తెలిపారు.నిషేధంలో ఉన్ననిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్య క్రమాలు నిర్వహించాలన్నముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## నేటి నుండి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం

**■వనపర్తి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు**

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:** ఏప్రిల్ 2 నుండి వనపర్తి జిల్లాలో తెల్ల రేషన్ కార్డుల వారికి చౌకధర దుకాణాల నుండి ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయనున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలోని ఆయా నియోజకర్గాల్లో స్థానిక శాసన సభ్యులు చౌకధరదుకాణాల్లో సన్న రకంబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,59,353 తెల్ల రేషన్ కార్డులు ఉండగా 5,22,367 మంది కుటుంబ సభ్యులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడించారు. రేషన్ కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున సన్నరకం బియ్యం ఉచితంగా ఇవ్వనున్నారు. దీనికోసం జిల్లాలో 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుంది. బుధవారం నుండి జిల్లాలోని మొత్తం 324 చౌకధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో సన్నరకం బియ్యం పంపిణీ చేయుటకు అవసరమైన ధాన్యం నిల్వలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని తెల్ల రేషన్ కార్డు కుటుంబాలు ప్రభుత్వం ద్వారా ఇస్తున్న ఉచిత సన్నరకం బియ్యాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపి.. ప్రజాపాలన చేయాలి

**■సిపిఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి**



సిపిఎం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**వీపనగండ్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపి ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి బాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వీపనగండ్ల మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యకర్తలను పోలీసు లు అరెస్టు చేసిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల ప్రభుత్వ భూముల వేలన్ని ఆపాలని భూముల అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చేసే ఆలోచన మంచి ది కాదని ప్రభుత్వ భూముల్లో పేదలు సెంటు రెండు సెంటుల్లో గుడిసెలు వేసుకుని నివాసం చేస్తుంటే ఆ గుడిసెలు తగలబెట్టి, నిర్బంధించి వారు ప్రజాధనం దోసుకుంటున్నారని పెద్ద ఎత్తున వారి మీద దమన కండ చేసే ఈ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం లోకి ఎట్ల దిగిందని రియల్ స్టేట్ వ్యాపారంఆపి ప్రజాపాలన చేయాలని ఆయన అన్నారు.అధికారం బలంతో సిపిఎం నాయ కులపై వీపనగండ్ల పోలీస్ స్టేషన్‌లో సిపిఎం మండల నాయకులు సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్,నవీన్‌లను ముందస్తు అరెస్టులుచేశారు. నిర్బంధాలు విధించిన ప్రభుత్వ ఆస్తీని అమ్మలేరని, రానున్నతరాలకు ఈఆస్తులు కాపాడి ఈ సంపదను అందిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కంసానిపల్లిలో ప్రైవేట్ నెట్వర్క్ సౌకర్యం ప్రారంభం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో నెట్వర్క్ సౌకర్యం కల్పించడం కోసం వోడాఫోన్ ఐడియా వారు సౌకర్యం మెరుగు పరిచారు. మండలంలోని కంసానిపల్లి గ్రామంలో ప్రైవేట్ నెట్‌వర్క్ సౌకర్యాన్ని మంగళవారం మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న సెల్ టవర్‌కు వోడాఫోన్ ఐడియా నెట్వర్క్ కనెక్షన్ ఇచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ అరుణా నర్సింహారెడ్డి తో పాటు మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కర్నే లక్ష్మినారాయణ, కొట్టే తిరుపతయ్య, వొడాఫోన్ ఐడియా డిస్ట్రిబ్యూటర్స్ శ్రీపురం భాస్కర్ రెడ్డి, సూరం ప్రశాంత్‌రెడ్డి,వోడాఫోన్ ఐడియా ఎంప్లాయిస్ ఆది మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**మద్దూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్న సంఘటన మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బూనీడు వాగు దగ్గర మద్దూర్ పోలీసులు పట్టుకున్నారు. మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంగళవారం రోజు బూనీడు వాగు నుంచి మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలి స్తుండగా ట్రాక్టర్లను పోలీసులు వెంబడించి పట్టుకొని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలించడానికి ఏ విధమైన పర్మిషన్ లేనందువలన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిం దని ఆయన వివరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసు కుంటామని మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలియజేశారు.

## పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని వినతి

**ధన్వాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** ధన్వాడలో గత రెండేండ్ల క్రితం గ్రామంలో పనిచేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయించాలని మంగళవారం పెండింగ్ బిల్లుల బాదితుడు అంజయ్య ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామంలో గత బీఆర్ఎస్ హయంలో సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనులు పూర్తి చేయిం చడం జరిగిందని, అందుకు ఎంబీ రికార్డులు సైతం అయ్యావని బిల్లులు రాలేదంటూ అంజయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ప్రభుత్వం ద్వారా పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పనులకు సంబంధించి రికార్డులు అయ్యావా అని అడిగారు. పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. పెండింగ్ బిల్లులు మంజురుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆర్మీకి ఎంపికైన యువకులను సన్మానించిన తోటి మిత్రులు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** ఆర్మీ ఉద్యోగాల్లో ఎంపికైన నారాయణపేట మండలం అవంగాపూర్ గ్రామానికి చెందిన కే. లక్ష్మికాంత్ ఎండి. రహిమాన్ పాషాలను గ్రామంలోని ఎల్లమ్మ కాలనీ వాసులు,తోటి స్నేహితులు అభినందిస్తూ ఇరువురిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపికైన యువకులతో బాటు పలువురు మాట్లాడుతూ ఆర్మీలో ఎంపికై దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి మిత్రులు కాలనీవాసులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహ నాలు నడపరాదని ఏఎస్సై ఆంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయ ణపేట జిల్లా కేంద్రంలో ఏఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళ వారం నారాయణపేట పోలీసులు ముమ్మరంగావాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకన్ కండిషన్ తనిఖీ చేసి 04 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలి పారు. ఈ సందర్భంగా శిక్షణ ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. కావున వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహన దారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానాతో పాటు జైల్ శిక్ష విధించడం జరుగుతుందని, మద్యం సేవించిన కేసులు పునరావృత్తం అయితే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని దాంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఊర్కొండపేట ఘటనపై ప్రజా సంఘాల నిరసన

**- నిందితులను శిక్షించాలంటూ డిమాండ్**



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్1, ప్రభాతవార్త:** ఊరుకొండ పేట ఆంజనేయస్వామి దేవాలయ శివారులో ఓ మహిళపై జరి గిన అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘా లు డిమాండ్ చేశాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వ హించి, పెద్దపెట్టున మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు, భవన నిర్మాణ కార్మిక సంఘం, అఖిల భారత ప్రజాతంత్రమహిళా సంఘం ఐద్వా,తెలంగాణ ఉద్యమ కారుల సంఘం,ఆవాజ్, వ్యవసాయ కార్మికసంఘం, ఎస్ఎఫ్ ఐ, డివైఎఫ్ఐ, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్ మాట్లాడుతూ అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ,మూడు నెలల్లోనే దోషులకు శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు వి. పద్మ మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై దాడులు దౌర్జన్యాలుఅత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయని, ఊరుకొండ పేటలో జరిగిన ఘటన సభ్య సమాజం తలదిం చుకునే మాదిరిగా ఉందని తీవ్రంగా ఖండించారు. దోషులకు కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల సంఘం జిల్లా నాయకులు గడ్డమీది గోపాల్ మాట్లాడు తూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఈ ఘటన సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని,ఈ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు కూడా ఇందులో దోషులుగా ఉన్నారని, దీనికి ప్రత్యక్ష బాధ్యత వహించిన వారి పైన కూడా కేసు నమోదు చేయాలని, దేవాలయంలోరక్షణ బాధ్యతలు చేపట్టాలని డిమాం డ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్ద గాలన్న, పట్టణ నాయకులు వరద లక్ష్మయ్యలు మాట్లాడుతూ శ్రామిక మహిళలు పైన చిన్న పిల్లలు మొదలుకొని పండు ముసలి వరకు అత్యాచారాల ఘటనలు జరుగుతున్నాయని ఈ ఘటనలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ సంగం నాయకులు సయ్యద్ గౌస్, కమరలీలు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాలని , మహిళల పై జరిగే దాడులు దౌర్జన్యాలు అత్యాచారాలను తీవ్రంగా ఖండిం చారు ఇందులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ ఈ ఘటన సభ్య సమాజాన్ని తల దించుకోవడమే కాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామానికి దగ్గరగా ఈ ఘటన జరిగిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని కోరారు.ఇందులో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఆనందు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్, ఐద్వా జిల్లానాయకురాలు జ్యోతి, సుశీల, సిఐటియు పట్టణ నాయ కులు రాజ్ కుమార్, ఈశ్వర్, గౌలిఆనంద్ పాల్గొన్నారు.

## పేదలందరికి సన్న బియ్యం

**■నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి**



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి

**కోయిలకొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన కోయిలకొండలోని డీలర్ ఆనంద్ గౌడ్ షాపులో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరము కృషి చేస్తుందన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన బియ్యం అందించి ఆరోగ్య సంక్షేమానికి పాటుపడడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్నింటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి రవీందర్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై విద్యాసాగర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెరికివీడు సత్యపాల్‌రెడ్డి, మండల తహసిల్దార్ రాజా గణేష్, నాయకులు పిట్ల శేఖర్ ముదిరాజ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎం రామస్వామి, రవినాయక్, వేముల జగన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు విక్రమ్ తేజ్ గౌడ్, మాజీ ఎంపిటిసి బి యాదవ కుమార్, రాము నాయక్, గులాం దస్తగిరి, జి.మనోజ్‌కుమార్, బండినాగరాజు,డీలర్ల సంఘం మండలాధ్య క్షుడు భీమ్‌రెడ్డి, డీలర్లు రామకృష్ణ, దమాయపల్లి ప్రవీణ్ కుమార్, ఆరిఫ్,నర్సింలు,భీమన్న, రామునాయక్ పాల్గొన్నారు.

## మహిళలపై వరుస అఘాయిత్యాలు జరగడం శోచనీయం

**బిఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, జిల్లా ఇంచార్జీ పృథ్వీరాజ్**



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్పీ

**ఊర్కొండ, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:** ఊర్కొండపేట ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో వివాహిత మహిళాపై నిందితులు అత్యాచారానికి ఒడిగట్టిన సంఘటన యావత్తు భారతదేశాన్ని కలచివేస్తోందని బిఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న అన్నారు. ఈ సంఘటనపై బిఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, జిల్లా ఇంచార్జ్ పృథ్వీరాజ్, కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షులు బాలులు మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడుతూ మహిళలపై వరుస సంఘటనలు జరగడాన్ని బిఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంద న్నారు.మొలచింతలపల్లిలో ఆదివాసీ మహిళాపై, ఇప్పుడు ఆలయం దగ్గర ఇంకో మహిళపై అత్యాచారాలు చోటు చేసుకో వడం బాధకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర అవుతున్న రాష్ట్రంలో హోంమంత్రి లేరని ఎద్దేవా చేశారు. జిల్లాల్లో జరుగుతున్న చాలా సంఘటనల్లో నిఘా విభా గం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర సీఎం స్పందించి జిల్లాల్లో పోలీస్, నిఘా విభాగాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నిందితుల వెనక ఎవరున్నా, ఎంత పెద్దవాళ్ళున్న కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. బాధిత మహిళా కుటుంబానికి రూ.50 లక్షలు ఇచ్చి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. నిందితులను కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో బిఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్, కల్వకుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జి మీసాలరమేష్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షులు కళ్యాణ్, కోశాధికారి భాస్కర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి నర్సింహ్మా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి విద్యార్థులకు పౌష్టికాహారం



**వీపనగండ్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గ్రామ వైద్య పౌష్టికాహారం దే సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు ఎదుగుదల సంబంధించి పౌష్టికాహారం అందజేసినట్లు అంగన్వాడి ఉపాధ్యాయులు సుగుణపాయి ఎల్లమ్మ మహేశ్వరి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా గ్రామ మహిళాసంఘం అధ్యక్షురాలు చిట్టెమ్మ కార్యదర్శి ముంత అలివేల హాజరై పౌష్టికాహారాన్ని చిన్న పిల్లలకు అందివ్వడం జరిగిందని వారు తెలిపారు. అయితే ప్రతి నెలకు అంగన్వాడీ సెంటర్లలో చిన్న పిల్లల ఎదుగుదల కోసం ప్రభుత్వం నుండి గుడ్లు, బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుంది అని వారు తెలిపారు. 7 నెలల నుండి మూడు సంవత్సరాల వరకు వయసుకలిగిన విద్యార్థులకు ఈ పౌష్టికాహారం అందజే యడం జరుగుతుందని వారు తెలిపారు. అయితే జీరో వయసు నుండి ఐదు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఎత్తు బరువులు కూడా తీయడం జరుగుతుంది అని వారు తెలిపారు. అలాంటి పిల్లలు బరువు తక్కువ ఉన్నవారు చిల్డ్రన్స్ హోమ్ పంపించి వారి ఎదుగుదలకు గుర్తించడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్పర్లు లచ్చమ్మ, నీరజ విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

## ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి



డిపో మేనేజర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** నారాయణపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళ స్వీపర్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్న ఆర్టీసీ లేబర్ కాంట్రాక్టర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి పనికి తగ్గ వేతనాలు అందజే యాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం పేట ఆర్టిసి డిఎం వీణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకుతో ఎక్కువ పని గంటలు చేయించుకొని అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నా డని తెలిపారు.పిఎఫ్ కార్మికుల ఖాతాలో జమ చెల్లిస్తున్నట్లు కార్మికులకు తెలియజేయడం లేదన్నారు. కార్మి కులకు కేవలం రూ. 6500 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ లో చూపించినంత వేతనం చెల్లించడం లేదని ఇలాంటి లేబర్ కాంట్రాక్టర్‌పై సరైన చర్య తీసుకోవాలని డిఎంను కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో వెంకటమ్మ, సుశీలమ్మ, కిష్టమ్మ, గోవిందమ్మ,కాశమ్మ, భాగ్య, కిష్టమ్మ, భీమమ్మ, బస్సమ్మ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**ఇటిక్యాల, ఏప్రిల్ 1 ప్రభాత వార్త :** మాజీ మంత్రి బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, వివేక్ బుక్ సెంటర్ యజమాని భీమన్న, ఉదండా పురం మాజీ సర్పంచ్ నడిపన్న మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా పలు సమస్యలపై ఆయనతో వారు చర్చించారు.

## సన్నబియ్య పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం

**నవాబుపేట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** పేదలు కూడా సంప న్నులతో సమానంగా సన్నబియ్యం తినే విధంగా సన్న బియ్యం అందించాలని గొప్ప ఆలోచన చేసిన రాష్ట్రప్రభుత్వం ఉగాది పర్వదినం సందర్భంగా ఈ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనీ నవాబుపేట తహసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం నవాబ్‌పేట్ మండల పరిధిలోని కారూర్, నవాబ్‌పేట్, రుద్రారం, కాకర్లపడ్, తీగలపల్లి గ్రామాల్లో తహసిల్దార్‌తో పాటు మాజీ డిసిసి అధికార ప్రతినిధి జనంపల్లి దుశ్యంత్ రెడ్డి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రేషన్ కార్డ్ దారులకు సన్న బియ్యం అందించడం జరిగింది. మండలం గ్రామ పంచాయతీ పరిధిలో చౌకధరల దుకాణాల ద్వారా మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తాసిల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం రేషన్ షాపులకు సన్న బియ్యం మండలంలోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు రేషన్ షాపుల్లో సన్న బియ్యాన్ని తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్య క్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, ఏఎంసీ చైర్మన్ హరలింగం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నీలకంఠం,ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, రాజశేఖర్, కాంగ్రెస్ మండల నాయకులు వెంకటేష్ గౌడ్, రమేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, ఎండి మైనుద్దీన్, నవాజ్ రెడ్డి, మాధవులు, సురేష్, వాసు యాదవ్, కొల్లి నర్సింలు, కోట్ల రాజేష్, ఆనంద్, బంక అంజన్ కుమార్ బంక వెంకటయ్య, గోపాల్, తానం సురేష్, నెత్తికోపుల ఆశన్న, హమీద్ మహేక్, ఏఎంసి డైరెక్టర్ శివకుమార్, వెంకటేష్ యాదవ్,కోస్గిరాజు బ్యాగరినరసింహులు,కొండాపూర్ నాయ కులు కొత్తగొల్ల బాలరాజు, కేశవులు, రుద్వారం, నాయకులు రవీందర్ గౌడ్, అచ్చన్న,పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



సన్నబియ్య పంపిణీని ప్రారంభిస్తున్న దృశ్యం

## యూనివర్సిటీ భూములు అమ్మొద్దు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మొద్దని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలోజరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ భూములు, సంపదను కార్పొరేట్,బడా కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు యూనివర్సిటీల బలోపేతానికి పని చేయాల్సింది పోయి యూనివర్సిటీలను బలహీనపరిచే విధంగా తమ చర్యలను కొనసాగించడం సిగ్గుచేటని విమర్శిం చారు. 2వేల ఎకరాలకు పైగాఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ భూములు గత ప్రభుత్వాలు అమ్ముకోవడం వలనే నేడు 1500 ఎకరాలకు మాత్రమే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.యూనివర్సిటీభూములను రక్షించాలనివిద్యార్థిని, విద్యా ర్థులు పెద్దఎత్తున ఉద్యమిస్తే వారిపైన పోలీస్ జులూమ్ ప్రయో గిస్తూ పోలీస్‌స్టేషన్లకు లాకెళ్లి నిర్బంధించడం దారుణమని విమ ర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి యూనివర్సి టీ భూములను యూనివర్సిటీలకి ఇవ్వాలన్నారు.అలా ఇవ్వకుండా ప్రభుత్వం మొండిగా నిరంకుశంగా ప్రభుత్వ ఆస్తులను బడా కార్పొ రేట్ శక్తులకు బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తే గత పాలకులకు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు.

## మాజీ ఎమ్మెల్యే ఆలను సన్మానించిన బీఆర్ఎస్ మైనార్టీ నేత సాధిక్

**భూత్పూర్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటే శ్వర్‌రెడ్డిని భూత్పూర్‌లో మంగళవారం బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు మొహ్మద్ సాధిక్ తన స్వగృహంలో శాలువతో ఘనం గా సన్మానించారు.సాధిక్‌ఏర్పాటు చేసిన విందుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆలను ముస్లిం సాంప్రదాయంగా శాలువ కప్పి సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు,మాజీ మున్సి పల్ చైర్మన్‌సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 16 కుటుంబాలకు వంట సామాగ్రి వితరణ

**గద్వాల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** సోషల్ రెస్పాన్సిబిలిటీ గద్వాల టీం, విద్యుత్ ఉద్యోగులు కల్లెం శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ బృందం సంయుక్తంగా మంగళవారం కోల్లం చెంచుపేట అమ్రా బాద్ మండలంకు వెళ్లి కొల్లం చెంచుపేటలో నివసిస్తున్నటువంటి 16 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 4200 విలువగల వంట పాత్రలు వితరణ ఇచ్చినట్లు సభ్యులు అశోక్ తెలిపారు.స్టిల్ బిందె లు, ప్లేట్స్, వాటర్ జగ్గులు, ప్లాస్టిక్ బక్కెట్ వాటర్ గ్లాసెస్, వంట చేసుకునే భోగణేలు మొదలైనవి ఇచ్చారు. అదేవిధంగా వంట సరుకులు, బట్టలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లెం శ్రీనివాసరెడ్డి, భాస్కర్, సలీం, అశోక్, సర్వేశ్వర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపట్ల హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**గద్వాల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతికి నిరసనగా జోగులాంబ గద్వాల జిల్లా క్రైస్తవ సంఘాలు, అభిమానులు వేలాదిగా తరలి వచ్చి, శాంతియుతంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు ఆదేశానుసారం గంజిపేట రాజు హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులో భాగంగా మని షిని మనిషిగా చూడండి, ప్రేమించండి, మతాల కన్నా మాన వత్వం మిన్న అన్నారు. మనిషి వర్ధిల్లాలి, ప్రేమ వర్ధిల్లాలి, జ్ఞానం వర్ధిల్లాలి అన్నారు. సమాన రాత్రి సమయంలో హత్య చేసి రోడ్డు పక్కన మృతదేహాన్ని పడేసిన బాధాకరమని తీవ్రంగాఖండిం చారు. రాజమండ్రిలోని రోడ్డు పక్కన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృత దేహం మీద బైక్ పడేసి ఉంది మొహం మీద మొత్తం గాయాలు ఉన్నాయి, బైక్ సీట్ మీద రక్తపు మరకలుఉన్నాయి. అలాగే పక్కనే చెక్కమీద రక్తపు మరకలు ఉన్నాయి. ఈ సంఘ టన యాక్సిడెంట్ అయినట్టు కనిపించడం లేదు కొంత మంది దుండగులు కావాలనే ప్రవీణ్ పథకం ప్రకారం ప్రయాణి స్తున్న సమయంలో హత్య చేసిరోడ్డు పక్కన పడేసి వెళ్లారు అని అను మానాలు వ్యక్తం అవుతున్నాయి.పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య ఘటనను హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. సి.బి.ఐ ఎంక్వయిరీ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి. పాస్టర్లకు రక్షణగా ప్రవీణ్ పగడాల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## సన్నబియ్యం పంపిణీ

**రాజాపూర్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రం లోని చౌకధర దుకాణం 12, 13 నెంబర్లలో మంగళవారం డీలర్ నారాయణ సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సన్నబియ్యం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం రాయపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించిన అనంతరం రాజాపూర్ తహసిల్దార్ విద్యాసాగర్ రెడ్డి సూచన మేరకు డీలర్ నారాయణ రాజాపూర్‌లో సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## ట్రాక్టర్ మెకానిక్ షెడ్డు దగ్ధం

**మద్దూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ట్రాక్టర్ మెకానిక్ షెడ్డుకు మంటలు అంటుకొని ఆ షెడ్డులో ఉన్న ఇంజన్ ఆయిల్, ట్రాక్టర్ స్పేర్ పార్ట్స్ దగ్ధం అయ్యాయని షాప్ యజమాని అశోక్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే ఉగాది పండు గ సందర్భంగా తమ కుటుంబంతో కలిసి సొంత ఊరు వనపర్తి జిల్లా సవాయిగూడెనికి వెళ్లడం జరిగిందని మద్దూరు మున్సిపాలిటీ సిబ్బంది వార్డులో శుభ్రం చేసే సందర్భంగా తన షెడ్డు పక్కన ఉన్న చెత్తను అంటి పెట్టడంతో షెడ్డులో ఉన్న సుమారుగా 80వేల నుంచి 1 లక్ష రూపాయల విలువగల ఆయిల్ డబ్బులు, ట్రాక్టర్ యొక్క స్పేర్ పార్ట్స్ దగ్ధం కావడం జరిగిందని అన్నారు.షెడ్డులో మంటలు రావడంతో ఇరుపక్కల ఉన్న ఇరుగు పొరుగువారు షెడ్డు డోర్ తెరిచి మంటలు ఆర్పడం జరిగిందని అన్నారు.ఈ అంశంపై గ్రామ మున్సిపాలిటీ సిబ్బందికి సమా చారం ఇవ్వగా కమిషనర్‌కు తెలియజేస్తామని సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. సుమారుగా 80 నుంచి 1 లక్ష రూపాయల వరకు నష్టపోవడంవల్ల తనపై ఆర్థిక భారం పడడంతో మున్సి పాలిటీ శాఖ అధికారులు తమ వంతుగా తనకు ఆర్థిక సాయం చేయాలని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**లింగాల, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:** ఇటీవల మండల కేంద్రానికి చెందిన సురేష్ అనే ఫోటో గ్రాఫర్ మృతి చెందారు. మంగళవారం అచ్చంపేట తాలుకా, లింగాల ఫోటో యూనియన్, వీడియో యూనియన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ.6800 అందజేశారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఫోటో, వీడియో యూనియన్ అధ్యక్షులు తాటికొండ గిరి, కోశాధికారి సలేశ్వరం, లింగాల మండల అధ్యక్షులు భాస్కర్, సీనియర్ ఫోటో గ్రాఫర్ ఆనంద్, అనిల్, రంజిత్, రాజు, కళ్యాణ్, ప్రచార కార్యదర్శి పిల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి వి.రజని




సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.రజని

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు మంగళ వారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మైనర్ బాలికలు అంగీకరించి చేసుకున్న పెళ్లిలు చట్ట ప్రకారం చెల్లవని పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు అవుతుందని. అదేవిధంగా మైనర్ బాలిక అనుమతితో శారీరకంగా కలిసిన అత్యాచారం కింద కేసులు నమోదు అవుతాయని తెలియజేశారు. అదేవిధంగా బాల్యవివాహాల చట్టం, మోటార్ వెహికల్ యాక్ట్ బాలకార్మికుల చట్టం సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలియజేశారు. కార్యక్రమాలలో సఖి లీగల్ కౌన్సిల్ డి. కృష్ణయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## 29 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టివేత

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జలాల్పూర్ గ్రామానికి చెందిన తెలుగు హనుమంతు అనే వ్యక్తి చుట్టుపక్కల గ్రామాల నుండి రేషన్ బియ్యం సేకరించి మంగళవారం బొలేరో వాహనంలో 29 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను కర్ణాటకకు తరలిస్తుంటే జలాల్పూర్ బస్టాండ్ దగ్గర టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి డిటి కాలప్ప పంచనామానంతరం తెలుగు హనుమంతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్‌ను తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

## అదుపు తప్పి లారీ బోల్తా : తప్పిన ప్రమాదం

**కల్వకుర్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** చారకొండ మండలం జూపల్లి గ్రామంలో అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మహబూబ్‌నగర్-కోదాడ జాతీయ రహదారిపై చారకొండ మండలం జూపల్లి గ్రామంలోని మేకల సంత వద్ద ఏపీ39యుసి8674 నంబర్ గల లారీ చక్కెర లోడుతో వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. అతివేగమై ప్రమాదానికి కారణమై ఉండొచ్చాయి స్థానికులు పేర్కొంటున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో ఎమ్ఎస్ సోల్యూషన్ కంప్యూటర్ షాపు, నునె గానుగఆయిల్ మిల్లు షాపులు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.1,16 లక్షల ఆర్థిక సహాయం చెక్కను బాధిత కుటుంబానికి అందించారు. భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘాలు ముందుకొచ్చి సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా ఆమనగల్లుకు మెడికల్ షాపు, సామాజిక సేవా నాయకులు రాము రూ.10వేల ఆర్థిక సహాయంఅందించినట్లు తెలిపారు. ఆయన వెంట సంఘం పట్టణ మండల అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్, వాస శేఖర్, డివిజన్ రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేత

**లింగాల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మండలంలోని అంబట్ పల్లి గ్రామంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో పది జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన సాయికిరణ్ టీంకు ప్రథమ బహుమతి, శివరామ్ టింకు ద్వితీయ బహుమతి అందజేశారు. ఈ కబడ్డీ టోర్నమెంట్‌కు సహకరించిన దాతలు ఆర్మీ జవాన్లు కె.రాజు, రమేష్, నిర్వాహకులు శివారెడ్డి, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

## పూలే విగ్రహావిష్కరణకు రాంనర్సయ్యకు ఆహ్వానం

**బిజినేపల్లి,ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈనెల 9న దళిత బహుజనుల ఆధ్వర్యంలో భారత దేశ సంఘ సంస్కర్త సామజిక పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు తెలంగాణ ప్రముఖ కవి, గాయకుడు గిద్దె రాంనర్సయ్యను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని అమూల్యా స్టూడియోలోమంగళవారం దళిత బహుజన సంఘాల రాష్ట్ర నాయకులు మంగివిజయ్ కలసి ఆహ్వానించినట్లు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణలో ప్రముఖ సింగర్, రేలాటరేలారే గంగ, వివిధ కళా బృందాలు కూడా పాల్గొంటాయని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ భారీ బహిరంగ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుషిపాక గణేష్ మాదిగ, బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకుడు శాగది బాలకృష్ణ పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను విజయంతం చేద్దాం

**బిజినేపల్లి, ఏప్రిల్1 ప్రభాతవార్త :** ఖానాపూర్ గ్రామంలో బిఎస్పి పార్టీ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల జాతర గోడపత్రికను ఆవిష్కరించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 26వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మహనీయుల జయంతి ఉత్సవాల జాతర సభ నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు పానుగంటి రాంచందర్ తెలిపారు. బీఎస్పీ నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జిబండి పృథ్వీరాజ్ మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ కాంగ్రెస్, పార్టీలు ఒకటే ఎజెండాతో పని చేస్తాయని అన్నారు. బహుజనుల సంక్షేమం, అభివృద్ధి రాజ్యాధికారం, కొరకు పనిచేసే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని అన్నారు. బహుజనులకు రాజ్యాధికారం కేవలం బిఎస్పి తోనే సాధ్యమని వివరించారు. సబ్బండ కులాలు ఏకమై బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మడుపు నాగేష్ అసెంబ్లీ అధ్యక్షులు కళ్యాణ్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షులుపానుగంటి రాంచందర్, బోనాసి భాస్కర్ గ్రామ అధ్యక్షులు రాము, బాలరాజు, నాగరాజు పులేందర్, కుందేటి రాము, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మెఘారెడ్డికి చీఫ్ విప్ పదవి ఇవ్వాలి

ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ యువనేత మండ్ల దేవన్న నాయుడు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :** వనపర్తిలో మంత్రి హోదాలో దౌర్జన్యాలు, దాడులు, భూకబ్జాలకు పాల్పడుతూ అవినీతికి తెరలేపిన నాయకుని ఎన్నికలలో ఓడించి మట్టి కరిపించిన ఎమ్మెల్యే మెఘారెడ్డికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ యువ నాయకుడు మండ్ల దేవన్న నాయుడు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వనపర్తిలోని ఏర్పాటు చేసిన సమావేశంలో మండ్లదేవన్ననాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిఏడాది కాలంలోనే వనపర్తి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందుకు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డికిరెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ప్రజాభివృద్ధికి పెద్ద జీతగాడిలా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళుతున్నారు. అభివృద్ధి మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యేకు ప్రభుత్వ చీఫ్ విప్ పదవి కేటాయించడం ద్వారా సాధ్యమవుతుందని మండ్ల దేవన్ననాయుడు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు, సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లురవి, మంత్రి జూపల్లి కృష్ణారావులు సహకరించి వనపర్తి అభివృద్ధి ప్రదాత తూడి మేఘారెడ్డికి ప్రభుత్వచీఫ్ విప్ పదవి కేటాయించేందుకు కృషి చేయాలని దేవన్న నాయుడు విజ్ఞప్తి చేశారు.

# ఆహార భద్రత చట్టం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ■ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**అడ్డాకుల, ఏప్రిల్1 ప్రభాతవార్త:** సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి అడ్డాకుల మండలంలో విచ్చేసిన జిఎంఆర్‌కి డ్డాకుల మండల ప్రజలు ఘన స్వాగతం పలికారు. సన్న బియ్యం పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు మహిళలు అడ్డాకుల మండల కేంద్రంలో రేషన్ షాప్ దగ్గర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టుకుంటూ ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. శ్రీమంతులే కాదు పేదలు కూడా సన్న బియ్యం తినాలన్నది ప్రజా ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. ఆహార భద్రత చట్టం తీసుకువచ్చి, రేషన్ షాపులు ప్రారంభించిన ఘనత కాంగ్రెస్ పార్టీది దేశంలోనే పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదని అన్నారు. పండుగ నాడే కాదు పేదలు ప్రతిరోజూ సన్న బియ్యం తినాలన్న సంకల్పంతో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టామని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 10లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 2 లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ పథకాలను ఇప్పటికే ప్రారంభించామని అన్నారు. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో రైతులకు ఏక కాలంలో 21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశాం. బిఆర్ఎస్ పదేళ్ల చేయలేనిది ఒక్క సంవత్సరంలో చేసి చూపించామని అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలోనే 58000 వేల ఉద్యోగాలు ఇచ్చావని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి జరుగుతుంది, ఎవరికైనా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం అప్లికేషన్లు పెట్టుకోవచ్చు, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. రాష్ట్రాన్ని దోచుకుని, అప్పులు చేసి బిఆర్ఎస్ ప్రభుత్వం చిప్ప చేతికిచ్చింది అయినా ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నాం, ఆశీర్వదించండి మన ముఖ్యమంత్రి పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డికి అండగా ఉండండి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి గంగుల విజయ్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున రెడ్డి, మాజీ ఎంపిటీసీ శకుంతల, మార్కెట్ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, హేమవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత మహిళకు న్యాయం చేస్తాం

◆నిందితులు బిజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన వారైనా రాజకీయం చేయదలచుకోలేదు

◆జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

**ఊర్కొండ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలంలో పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో చోటు చేసుకున్న సామూహిక అత్యాచార సంఘటనలో నిందితులు ఎవరున్న వదిలి పెట్టేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ నాగార్జున కలిసి అత్యాచార ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడుతూ సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీని కోరానని వెల్లడించారు. ఊర్కొండపేట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో 7మంది యువకులు ఒక వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నానన్నారు. పవిత్ర ప్రదేశంలో ఈ దురాఘాతానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అత్యాచారానికి పాల్పడిన వారు బిఆర్ఎస్, బిజేపీ పార్టీకి చెందిన వారని తన దృష్టికి వచ్చిందని, అయితే ఈ సంఘటనకు పాల్పడింది ఎవరైనాప్పటికీ తాను రాజకీయాలు చేయదలుచుకోలేదని బాధిత మహిళలకి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశ్యమన్నారు. ఈ సంఘటనలో బాధితురాలికి అండగా ఉంటానని అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంఘటన నేపథ్యంలోని ఊర్కొండ పోలీసులతో కూడా మాట్లాడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు రాత్రి పూట బస చేసే భక్తులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య గౌడ్, ఈఓట సత్యనారాయణ, ఆలయ చైర్మన్ నారెడ్డి సత్యచంద్రారెడ్డి, నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి, రమేష్‌నాయక్, అబ్దుల్ సమీ, వీరస్వామి, వహిదొద్దిన్, ఆదినారాయణ, నాగోజీ, సంతోష్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ఆరిఫ్, అఖిల్, కొండల్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పూలే జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్




మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్1,ప్రభాతవార్త:** కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖుడు, అంబేద్కర్ తన గురువుగా భావించిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే జన్మదినాన్ని ప్రభుత్వం అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏం శ్రీనివాస్ సాగర్ కోరారు. మహబూబ్‌నగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తన జీవితాన్ని మొత్తం విద్య, అణగారిన వర్గాల కోసం అభ్యున్నతి కోసం కృషిచేసిన పోరాటయోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని, భార్య సావిత్రిబాయి తో కలిసి భారత దేశంలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన పూలే, తన జీవితాన్ని మొత్తం బహుజనుల కొరకు త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు..అటువంటి మహానుభావుని జయంతి రోజును ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించి ఆరోజు మొత్తం కార్యక్రమాలు నిర్వహించిఅతని గొప్పతనాన్ని అందరికీ తెలియజేసే విధంగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు..రిటైర్డ్ డి ఈ ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించాలని ఉద్దేశంతో సత్యశోధక్ అనే సంస్థను ఏర్పాటు చేసి అన్ని కులాలను, మతాలను భాగస్వామ్యం చేసి అన్నగారిన వర్గాలపక్షాన పోరాటం చేసిన మహాయోధుడు అన్నారు..అంతటి మహానుభావుని జన్మదినం రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి భీంపల్లి శ్రీకాంత్, రమేష్ గౌడ్, బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ఎస్. విజయకుమార్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీ ్మకాంత్, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, బంద్రవల్లి మాజీ సర్పంచ్‌మహేష్ గౌడ్, నరహరి తదితరులు

## సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిరెడ్డి అన్నారు. మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నారాయణపేట, దామరగిద్ద తదితర గ్రామాల్లో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న బియ్యం పథకం నిరుపేదలకు ఒక వరమన్నారు. ఏ ప్రభుత్వాలున్నా ఈ సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయలేరు అన్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నట్లు తెలిపారు. ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం. పేదవారి గుండెల్లో శాశ్వతంగానిలిచిపోవాలన్న సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించాం అన్నారు. పేదలు దొడ్డు బియ్యం తినలేరు. పీడీఎస్ బియ్యాన్ని మిల్లర్లు, దళారులు సైక్లింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి పేదవారి ఇంట ప్రతిరోజూ పండుగ జరగాలన్న ఆలోచనతో, పేద వారి కడుపు నింపాలన్న లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగవార్, రెవిన్యూ, పౌరసరఫరాల అధికారి అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం

**కల్వకుర్తి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలోమంగళవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన డివిజన్ రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పట్టణ, మండల సంఘాల ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యల కోసం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. అదే విధంగా ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భూములు లక్కోవడమే పనిగా పెట్టుకున్న రేవంత్ సర్కార్

మాజీ ఎమ్మెల్యే , బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 1ప్రభాతవార్త:** హైడ్రా పేరుతో జనాల వద్దకు వెళితే పొట్టు పొట్టునా తిడుతుండడం వల్లనే మూగ జీవాలు ఉన్న ప్రాంతానికి వెళితే అవి ఎలాగో తిట్టలేవనే ఉద్దేశ్యంతో రేవంత్ రెడ్డి సర్కార్ ఎలాగైనా సరే భూములు లాక్కోవడమే పనిగా పెట్టుకున్నట్లుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న సంఘటన స్పష్టం చేస్తుందని నారాయణ పేట మాజీ శాసన సభ్యులు, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు వందల మంది విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తుంటే ప్రభుత్వం తరఫున ఒక మంత్రి కానీ, ఒక అధికారి కానీ యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవాల్సింది పోయి అక్రమంగా రాత్రికి రాత్రే వందల సంఖ్యలో బుల్డోజర్లను రప్పించి భూములను చదును చేసే పనులకు శ్రీకారం చుట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంఘటనను అడ్డుకోవడానికి పోయిన విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు ఇదే యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన రేవంత్ రెడ్డికి అప్పుడే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై కన్ను పడిన విషయం 15 నెలల తర్వాత ఇప్పుడిప్పుడే స్పష్టం అవుతుందనీ తెలిపారు. రేవంత్ రెడ్డి తీరు ఇలాగే కొనసాగితే ఇదే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిన్ను తెలంగాణ ప్రజలు, విద్యార్థులు రాబోయేరోజుల్లో ఫుట్‌బాల్ ఆడడం మాత్రం తంథాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనక్కి తగ్గవలసిన అవసరం ఎంతో ఉంది అని తెలిపారు.

## సేవా కార్యక్రమాలతో వ్యక్తిత్వ వికాసం

◆ ప్రిన్సిపాల్ డా. పి రాములు

◆ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక వేసవికాల శిబిరం ప్రారంభం

**బిజినేపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వ్యక్తిత్వ వికాసం పెంపొందడంతో పాటు సామాజిక బాధ్యత అలవడి ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని ప్రిన్సిపాల్ డా. పి రాములు అన్నారు. పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల అటానమస్ ఎన్ఎస్ఎస్ వన్‌టు యూనిట్ ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక వేసవికాల శిబిరం నిర్వహణ కోసం మంగనూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ బీసీ వార్డును యూనిట్ టు ఎస్సీ వార్డును ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వి. చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్‌ప్రోగ్రాం అధికారి డా. సి. నాగరాజు ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి డి.శివ అధ్యాపకులు బి వెంకటేష్, మనోజ్ కుమార్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఊర్కొండపేట ఘటన అమానవీయం

■ పోలీసులు పక్కగా దర్యాప్తు చేయాలి

■ నిందితులను కఠినంగా శిక్షించాలి

■ మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సీ లక్ష్మారెడ్డి



**జడ్చర్ల/ఊర్కొండ, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఊరుకొండ పేటలో మహిళ పై జరిగిన అత్యాచార ఘటన అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహిళపై గ్యాంగ్ రేప్ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసు పక్కాగా దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలపై ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. పోలీసులు నిఘా వ్యవస్థ పెంచాలని సూచించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడుమహిళల భద్రత అంశం ఆందోళన కలిగిస్తుందన్నారు. తన నియోజకవర్గం జడ్చర్ల లో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం పై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అత్యాచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలన్నా రు. పోలీసులు అన్ని రకాలుగా ఆధారాలు సేకరించి నిందితులు ఎవ్వరైనా వదిలి పెట్టకుండా నిస్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు.

## ఊర్కొండ పేట ఘటన ఘోరం.. దోషులను ఉరి తీయాలి

■భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కళావతమ్మ




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ కళావతమ్మ

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్1 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ పేట వద్ద గత శనివారం మహిళపై జరిగిన గ్యాంగ్ రేప్ ఘోరమని, దోషులను ఉరితీయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కళావతమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి ఆఫీస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన స్నేహితుడితో కలిసి ఒకమహిళ ఉత్సవానికి వెళ్లి వస్తుండగా, ఊర్కొండ పేట వద్ద సుమారు 9 మంది యువకులు తాగిన మత్తులో ఆమె స్నేహితుడిని చెట్టుకు కట్టేసి, కళ్ల ఎదుటే 4 గంటలు హింసించి గ్యాంగ్ రేప్ చేశారని, దాహం అని అడిగితే నోట్లో మూత్రం పోసారని ఇది మనుషులు చేసే పనేనా అని ప్రశ్నించారు. ఘటనను ఖండించారు. 7గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారని, ఇద్దరు తప్పించుకు తిరుగుతున్నారని వారిని కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారావిచారించి నిందితులకు వెంటనే ఉరిశిక్షలుపడేలా పోలీసులు చూడాలన్నారు. ఇలాంటి వారికి ఉరే సరైన శిక్ష అన్నారు. సమాజంలో బతకటానికి వీరు అనర్హులన్నారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవటానికి మద్యంపై ఆధారపడటం సరికాదన్నారు. గ్రామ గ్రామాన సందు సందుకు బెల్ట్ షాపులు నడుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం గతంలో బెల్ట్ షాపులను తొలగిస్తామని చెప్పారని ఇంతవరకు చర్యలు లేవన్నారు. మందు అందుబాటులో ఉండటంతో తాగి యువకులు, మైనరు పిల్లలు కూడా దారుణాలకు దిగబడుతున్నారన్నారు. వెంటనే బెల్టు షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, మహిళా సమాఖ్య పట్టణకు కన్వీనర్లు, శిరీష, భూమిక, నేతలు శ్రీదేవి, జ్యోతి, అమృత తదితరులు పాల్గొన్నారు

## భూముల వేలాన్ని వెంటనే ఆపండి

మొదటి పేజీ తరువాయి భాగం..

జారీ చేశారు. గతంలో భూముల అమ్మకాన్ని వ్యతిరేకించిన రేవంత్.. ఇవాళ ఆయనే స్వయంగా హెచ్‌సీయూ భూములను ఎందుకు అమ్మకునాలనుకుంటున్నారో సమాధానం చెప్పాలని కోరారు. ఓ విద్యాసంస్థకు చెందిన భూములను మీ స్వార్థం కోసం అమ్ముకుంటారా..? విద్యార్థులు వ్యతిరేకిస్తున్నా ఎందుకీ మొండి వైఖరి ఎవరి కోసం ఈ వేలంపాటు..? ఈ భూముల వేలం వద్దంటూ హెచ్‌సీయూవిద్యార్థులు ఆందోళనల చేస్తున్నా.. పోలీసు నీడలో ఎందుకు వేలం వేయాలనుకుంటున్నారు? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసే దమ్ము లేకే భూముల అమ్మకాలు చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నాం కదా అని అహంకారంతో ఏదిపడితే అదిచేస్తే ఊరుకోమన్నారు. రేవంత్ రెడ్డి స్వలాభం కోసమే ఈ భూములను వేస్తున్నారుని చెప్పారు. విద్యార్థులంతా ఈ భూముల వేలాన్ని వద్దని అడ్డుకుంటుంటే.. రేవంత్ రెడ్డి పట్టుబట్టడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు.

**కేంద్రమంత్రికి ఫిర్యాదు..**

హెచ్‌సీయూ భూముల వేలం వివాదంపై స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు బీజేపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. కేంద్ర ఎన్విరాన్‌మెంటల్ మినిస్టర్ భూపేందర్ యాదవ్‌కు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలోను కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల, రఘునందన్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నాగేష్ ఫిర్యాదు చేశారు. వేలాదిగా నెమళ్ళు, జింకలు, ఇతర వన్యప్రాణులకు నిలమైన హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.